క్లుప్తంగా

ఆత్మీయ భరోసా అమలు చేయాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలని ఏఐపీకేఎంఎస్ నాయకులు కోరారు. ఈమేరకు వారు మంగళవారం డొంకేశ్వర్ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, భూమి లేని ఉపాధి కూలీలందరికీ ఆత్మీయ భరోసా అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం జీపీ కార్యదర్శి శేఖర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు గంగాధర్, రైతులున్నారు.

ఆహార భద్రతపై అవగాహన



పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్‌లో మంగళవారం మెప్మా ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు ఆహార భద్రతపై ఫుడ్ సేఫ్టీ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వీధి ఆహార విక్రేతలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఆహార భద్రత, వ్యాధుల నివారణ, ఆహార నిల్వపై వీధి వ్యాపారులకు ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ నవిత, ఎస్ఎస్ఎస్ఏఐ ట్రైనర్లు రాజీవ్ కుమార్, పొన్నాల దినకర్ శిక్షణనిచ్చారు. అనంతరం వ్యాపారులకు సర్టిఫికెట్లను అందజేశారు. మెప్మా టీఎంసీ ఉదయశ్రీ, సీవో రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వంద రోజుల ప్రణాళిక

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ప్రణాళిక ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతుంది. మంగళవారం పట్టణంలోని 14వ, 35వ వార్డులలో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై మున్సిపల్ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను బ్యాన్ చేయాలని, సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. సానిటరి ఎస్సై నరేందర్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, ఇంచార్జ్ శానిటరీ ఎస్సై సురేష్, వార్డ్ ఆఫీసర్లు రాజేష్, నీలిమ, సానిటరీ జవాన్లు, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరయ్యాయి. 8 మందికి ఇళ్లు మంజూరు కాగా, మంగళవారం మంజూరు పత్రాలను కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. నాయకులు రవి, బుచ్చిమల్లయ్య, సింగిరెడ్డి శేఖర్, సల్లూరి గణేష్‌గౌడ్, నల్ల గణేష్, కిషన్‌గౌడ్, దీపక్, నరేందర్, శైలేందర్ ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పద్మశాలీ కల్యాణ మండపంలో మంగళవారం మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంగరి రవీందర్, ఉపాధ్యక్షులుగా పద్మ వినాయక్, సారా ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పసుపుల లింగమూర్తి, కోశాధికారిగా పోడేటి నర్సయ్య, గౌరవాధ్యక్షుడిగా లుక్క గంగాధర్, ప్రచార కార్యదర్శిగా ఎండీ అమీర్, సహాయ కార్యదర్శిగా అజయ్‌కుమార్, సలహాదారులుగా శ్రీకాంత్, సంపత్, కార్యవర్గ సభ్యులుగా పవన్, అన్వేష్ ఎన్నికయ్యారు.

జీపీ కార్యాలయం తనిఖీ



డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఎంపీడీవో బుక్య లింగం పరిశీలించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సామగ్రిని భద్రపరిచేందుకు జీపీ భవనాలను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సామగ్రి వస్తే వాటిని ఎక్కడ ఉంచాలో ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు. అనంతరం తొండాకూర్‌లో ఉపాధి హామీ పనులపై జరిగిన గ్రామ సభలో ఎంపీడీవో పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శి రవి, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

సాలూర జెడ్పీహెచ్ఎస్‌లో మాక్ పోలింగ్

బోధన్: సాలూరలోని పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా దేశంలో జరిగే సాధారణ ఎన్నికల మాదిరిగా విద్యార్థులు పలు పదవులకు నామినేషన్ సమర్పించి పోటీలో నిలిచారు. పోలింగ్ నిర్వహించగా విద్యార్థులు ఓటు వేశారు. అనంతరం కౌంటింగ్ నిర్వహించి, అధిక ఓట్లు సాధించిన వారిని విజేతలుగా ప్రకటించారు. అనంతరం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం, ఎంఈవో రాజీమంజూష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు పాటుపడదాం

- సబ్ కలెక్టర్ వికాస్ మహతో
- పలు గ్రామాల్లో గణేశ్ విగ్రహాల పంపిణీ



నందిపేటలో వినాయకుడి ఆకృతిలో కూర్చున్న ఉజ్వల పాఠశాల విద్యార్థులు



బోధన్‌లో మట్టిగణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ విఠల్

సాక్షి నెట్‌వర్క్: పర్యావరణ రక్షణ కోసం కృషి చేయాలని, ఇందుకోసం ప్రతిఒక్కరూ మట్టి గణపతులనే పూజించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని పలు మండలాలు, గ్రామాల్లో వినాయక చవితి నేపథ్యంలో మంగళవారం వివిధ స్వచ్ఛంద సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేశారు. బోధన్‌లో డివిజన్ రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని మట్టిగణపతి ప్రతిమలను సబ్ కలెక్టర్ వికాస్ మహతో రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మట్టి గణపతుల వల్ల నీరు కాలుష్యం కాకుండా ఉంటుందన్నారు. ఆర్మూర్‌లో సేవ్ లైఫ్ ఫౌండేషన్ సంస్థ చైర్మన్ సాయిప్రభాస్ ఆధ్వర్యంలో మట్టి గణపతులను సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి పంపిణీ చేశారు. అలాగే పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులతో మట్టి గణపతులను తయారు చేయించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. గణపతులను పంపిణీ చేశారు. మాక్లూర్ మండలం అమ్రాద్ పాఠశాలలో డీఈవో అశోక్ విద్యార్థులకు మట్టి గణపతులను అందజేశారు.



అమ్రాద్‌లో మట్టి గణపతులు అందజేస్తున్న డీఈవో



ఆర్మూర్‌లోని జెంటిల్‌కిడ్స్ పాఠశాలలో..



నందిపేటలో..



సుంకెట్ ఉన్నత పాఠశాలలో..



ఆర్మూర్‌లో మట్టి గణపతులను ప్రజలకు అందజేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి



మానిక్ బండార్ ఆర్టీసీ కాలనీలో..



అంక్సాపూర్ హైస్కూలులో..



పోతంగల్ ఉన్నత పాఠశాలలో..



కుకునూర్ హైస్కూలులో ..



సాలూర జెడ్పీహెచ్ఎస్‌లో ..



బోధన్ పట్టణంలో..



పడకల్ హైస్కూల్‌లో..

నిమజ్జనంలో ఇబ్బందులు రాకుండా చూడాలి



గూండ్ల చెరువు వద్ద రోడ్డు మరమ్మతులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్: వినాయక ఉత్సవాల్లో భాగంగా విగ్రహాల నిమజ్జనం సమయంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు సిబ్బందికి సూచించారు. పట్టణంలోని పలు వార్డుల్లో గుంతలమయంగా మారిన రోడ్లకు మంగళవారం మరమ్మతులు చేపట్టారు. పనులను కమిషనర్ పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. నిమజ్జనం రోజు వరకు పట్టణంలోని రోడ్ల గుంతలు లేకుండా మరమ్మతులు పూర్తి చేస్తామని కమిషనర్ పేర్కొన్నారు. మున్సిపల్ ఏఈ కిరణ్, సానిటరి ఎస్సై నరేందర్, చందు, రాహుల్ పాల్గొన్నారు.

భీమ్‌గల్ చెరువు పరిశీలన

మోర్తాడ్: భీమ్‌గల్‌లో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేసే రాగన్న కట్ట చెరువును మంగళవారం ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా పరిశీలించారు. వినాయకుడి నిమజ్జన వేడుకల సందర్భంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండటానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ గోపు గంగాధర్, తహశీల్దార్ షబ్బీర్, ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్, ఎస్సై సందీప్ తదితరులు పాల్గొన్నారు.



భీమ్‌గల్‌లో చెరువును పరిశీలిస్తున్న ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా

పంట నష్టం వివరాలను సేకరించాలి

రెంజల్(బోధన్): ఇటీవల కురిసిన వర్షాలకు గోదావరి, మంజీరా నదుల పరీవాహకం ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటల వివరాలను వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను నమోదు చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. మండలంలోని కందకుర్తి శివారులో వరదలకు నీట మునిగి దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి విడతల వారీగా హామీలను నెరవేరుస్తున్నట్లు వివరించారు. వ్యవసాయ పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడకుండా గ్రావెల్ రోడ్లకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పేపర్‌మిల్ గ్రామంలో 120 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకాగా 80 మంది గృహ నిర్మాణాలు ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతారెడ్డి రాజారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, నాగభూషణంరెడ్డి, ఖలీంబేగ్, గయాస్, చుంచుల రాములు, దనుంజయ్, నితిన్, సురేందర్‌గౌడ్, సాయిబాబగౌడ్, ఆసాని అనీల్, జావీద్, ప్రవీణ్, సిరాజ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.



కందకుర్తి శివారులో దెబ్బతిన్న సోయా పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

టీఎల్ఎంతో బోధన సులభతరం



రుద్రూర్‌లో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్..

పెర్కిట్ మోడల్ పాఠశాలలో..



పెర్కిట్‌లో టీచర్లకు జ్ఞాపికలు అందజేస్తున్న ఎంఈవో

రుద్రూర్: టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వల్ల బోధన సులభతరమవుతుందని, విద్యార్థులు విషయం సులభంగా అర్థం చేసుకుంటారని ఎంఈవో కట్ట శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర హైస్కూల్‌లో మంగళవారం మండల స్థాయి టీఎల్ఎం మేళా కార్యక్రమాన్ని తహసీల్దార్ తారాబాయి ప్రారంభించారు. అనంతరం మేళాలో టీచర్లు ప్రదర్శించిన బోధన ఉపకరణాలను పరిశీలించారు. ఎంపీడీవో భీమ్‌రావ్, ఎస్సై సాయన్న టీచర్లు పాల్గొన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్ మోడల్ స్కూల్‌లో బోధనోపకరణాల మేళా నిర్వహించారు. ఆర్మూర్ మండలంలోని ఉపాధ్యాయులు తాము రూపొందించిన బోధనోపకరణాలను ప్రదర్శించారు. ఉత్తమ బోధనోపకరణాలను రూపొందించిన ఉపాధ్యాయులకు ఎంఈవో రాజ గంగారాం జ్ఞాపికలతో పాటు ప్రశంస పత్రాలను అందజేశారు. ప్రిన్సిపల్ శ్యామ్, హెచ్ఎంలు లక్ష్మీ నర్సయ్య, శ్రీనివాస్, బ్రహ్మానందం, నవీన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్స్..

ఇద్దరి హత్యకేసులో నిందితుల రిమాండ్

మాక్లూర్: తమను చంపడానికి వచ్చిన ఇద్దరిని ఎదురుదాడి చేసి హతమార్చిన ఘటనలో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు నార్త్ జోన్ సీఐబి శ్రీనివాస్ తెలిపారు. మాక్లూర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నిజామాబాద్‌లోని గౌతం నగర్‌కు చెందిన జీలకర్ర ప్రసాద్ అతని స్నేహితుడు ఆకాష్‌లు కలిసి ఆదివారం అర్ధరాత్రి మండలంలోని ధర్మోరా గ్రామానికి వెళ్లారు. గ్రామానికి చెందిన గంధం నడ్పి గంగారాం కుటుంబసభ్యులను హతమార్చబోయి వారే హత్యకు గురయ్యారు. ఈ ఘటనలో గంధం నడ్పి గంగారాం, అతని కుమారులు పెద్ద సాయిలు, చిన్నసాయిలు, చిన్న కొడలు నాగమణి, అల్లుడు మోటం గంగాధర్ మొత్తం ఐదుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పీఎం కిసాన్ స్కీమ్ పేరిట సైబర్ మోసం

బోధన్‌రూరల్: మండలంలోని కల్దుర్కి గ్రామానికి చెందిన బగారే అమ్రపాల అనే మహిళకు వాట్సాప్‌లో పీఎం కిసాన్ యోజన స్కీమ్ పేరిట లింక్ పంపి సైబర్ మోసగాళ్లు రూ.32,290లు కాజేశాడు. వివరాలు ఇలా.. గత నెల 28న అమ్రపాల వాట్సాప్‌కు లింక్ పంపగా ఆమె ఇన్‌స్టాల్ చేసుకుని ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు నమోదు చేసింది. దీంతో సైబర్ మోసగాడు ఆమె బ్యాంక్ ఖాతా నుంచి రూ.32,290లు విత్‌డ్రా చేసుకున్నాడు. బాధితురాలు మోసపోయినట్లు గ్రహించి మంగళవారం బోధన్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు కాల్‌చేసి సైబర్ మోసగాడి ఖాతాలో రూ.26,601 ఫ్రీజ్ చేసినట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.

డయల్ 100ను దుర్వినియోగం చేసిన ఇద్దరికి జైలు

కమ్మర్‌పల్లి/ వేల్పూర్: డయల్ 100కు కాల్ చేసి విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరికి ఆర్మూర్ కోర్టు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ జైలు శిక్ష విధించారు. వివరాలు ఇలా.. కమ్మర్‌పల్లిలో కూలీగా పనిచేస్తున్న తన్నీరు వెంకటేష్ పలుమార్లు అనవసరంగా డయల్ 100కు కాల్ చేశాడు. దీంతో ఆయనపై కేసు నమోదు చేసి ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి మూడు రోజులు జైలుశిక్ష విధించినటు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి చెందిన మీసాల శబరీష్ అర్ధరాత్రి డయల్ 100కు ఫోన్ చే స్తూ తీవ్ర ఇబ్బందికి గురిచేయడంతో జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు.

నలుగురు డీజే ఆపరేటర్ల బైండోవర్

రుద్రూర్: గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని నలుగురు డీజే ఆపరేటర్లను తహసీల్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ తారాబాయి ఎదుట ఎస్సై సాయన్న బైండోవర్ చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తే రూ. లక్షా 50వేలు జరిమానా విధించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

వేల్పూర్: మండల కేంద్రంలో మంగళవారం పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. వేల్పూర్ శివారులో పేకాడుతున్నట్లు అందిన సమాచారంతో దాడి చేయగా నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారని, వారి వద్ద రూ. 5 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

నవీపేట : నవీపేట శివారులో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ ముగ్గురికి జడ్జి నూర్జహాన్ బేగం మంగళవారం జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. అభంగపట్నం గ్రామానికి చెందిన మల్లెల సాయికుమార్‌కు ఏడు రోజులు, మద్దేపల్లి గ్రామానికి చెందిన వసంత్‌కు మూడు రోజులు, నాగేపూర్ గ్రామానికి చెందిన రవికి నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

'ఏటీసీ'తో ఉపాధి అవకాశాలు

మోర్తాడ్: అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లోని వివిధ కోర్సులలో శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని భీమ్‌గల్ ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ సూచించారు. మంగళవారం ఏటీసీ సెంటర్ భవన నిర్మాణం పనులను పరిశీలించారు. 175 సీట్లకు గాను 100 మంది దరఖాస్తు చేసుకున్నారని ఇంకా 75 మందికి అవకాశం ఉందన్నారు. ఏటీసీ సెంటర్‌లో శిక్షణ ఇచ్చే కోర్సులతో విదేశాలలోను ఉపాధి పొందవచ్చని వెల్లడించారు.

మాక్లూర్‌లో టీబీ పరీక్షలు

మాక్లూర్: మండలంలోని కల్లెడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా టీబీ అనుమానితులకు పరీక్షలు నిర్వహించారు. అలాగే చిన్నాపూర్ గ్రామంలోనూ వైద్య శిబిరం నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనుమానిత టీబీ రోగులకు తగిన మందులు అందజేశారు. ఆరోగ్య విస్తర్ణ అధికారి ప్రవీణ్‌రెడ్డి, సూపర్‌వైజర్ సోమశేఖర్, ప్రభాకర్, సరిత, దమయంతి, సరోజ, వనిత, సుజాత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫర్ పాలసీలో లోపించిన పారదర్శకత

రుద్రూర్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విద్యాలయం అధికారుల తీసుకువచ్చిన ట్రాన్స్‌ఫర్ పాలసీలో పారదర్శకత లోపించిందని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తీరును నిరసిస్తూ మంగళవారం వారు రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫర్ పాలసీపై ప్రశ్నించిన శాస్త్రవేత్తలకు అధికారులు మెమోలు జారీ చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి ఉద్యోగుల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని కోరారు. ప్రాంతీయ వరి, చెరుకు పరిశోధన కేంద్రం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మోర్తాడ్: నిజామాబాద్‌లోని నాగారం స్టేడియంలో ఇటీవల నిర్వహించిన సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో మోర్తాడ్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రసాద్ మంగళవారం అభినందించారు.

'స్థానికులతో ప్రాణహాని ఉంది'



నిజామాబాద్ నాగారం: ప్రహరీ విషయంలో స్థానికుల నుంచి తనకు ప్రాణహాని ఉందని డొంకేశ్వర్ మండలం జీజీ నడ్కుడ గ్రామానికి చెందిన మాడవేడి గోదావరి ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామంలో తన ఇంటికి సంబంధించి పంచాయతీ అనుమతి ప్రకారం ప్రహరీ నిర్మించినట్లు తెలిపారు. ఐతే ప్రహరీ నిర్మాణానికి చుట్టుపక్కన ఉండే కొమరం వెంకటి అతని భార్య నాగమణి, కొమురం లక్ష్మి, మగ్గిడి అలియాస్ బుర్కా రవి, జవ్వాజి రాజేశ్వర్‌గౌడ్, జవ్వాజి శేఖర్ గౌడ్, బొంగోని రాజా గౌడ్, మగ్గిడి గంగుబాయిలు అడ్డుకుంటున్నారని వారిపై చట్టరీత్యా పోలీసులు చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరారు. తనను హత్య చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. ఈ విషయమై నందిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని గోదావరి ఆరోపించారు. తనకు ప్రాణహాని ఉందని ప్రజావాణిలో కలెక్టర్, సీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం



అంక్సాపూర్‌లో మాట్లాడుతున్న ఏవో శృతి

వేల్పూర్/కమ్మర్‌పల్లి: ఆయిల్ పామ్ సాగుచేసే రైతులకు ప్రభుత్వం అధిక ప్రోత్సాహం ఇస్తోందని వేల్పూర్ ఏవో శృతి అన్నారు. వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ రైతు వేదికలో మంగళవారం రైతులకు ఆయిల్ పామ్ సాగుపై ఆమె అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా శృతి మాట్లాడుతూ.. ఎకరానికి సరిపడే 50 మొక్కలను కేవలం వేయి రూపాయలకే ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. ఈ పంట సాగుచేసే ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం రాయితీపై డ్రిప్ సౌకర్యం, మిగతా రైతులకు 90 శాతం రాయితీపై అందిస్తోందన్నారు. ఇప్పటికే ఈ పంట సాగుచేస్తున్న రైతులు తమ అనుభవాలను మిగతా రైతులకు వివరించారు. వరి, మొక్కజొన్న పంటలకు ప్రస్తుత పరిస్థితుల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. అలాగే కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలోని రైతు వేదికలో ఏవో రమ్యశ్రీ ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఈవోలు ప్రశాంత్, పద్మ, రాజు, నగేష్‌గౌడ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పెద్దమల్లారెడ్డి, గంగయ్య, భూమయ్య ఉన్నారు.

కళాశాలల్లో బోధన తీరుపై పక్కా పర్యవేక్షణ



బోధన్‌లోని ప్రభుత్వ కళాశాలలో మాట్లాడుతున్న ఇంటర్ జిల్లా ప్రత్యేక అధికారి ఒడ్డెన్న

బోధన్: ఇంటర్ కళాశాలలో ప్రతి తరగతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పాఠ్యాంశాల బోధన తీరును కమాండ్ కంట్రోల్ ద్వారా పక్కాగా పర్యవేక్షించనున్నట్లు ఇంటర్మీడియేట్ బోర్డు జిల్లా స్పెషల్ ఆఫీసర్ దాసరి ఒడ్డెన్న తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించి అధ్యాపకులతో మాట్లాడారు. కళాశాలలోని తరగతి గదిలో సీసీ కెమెరాల ఏర్పాటుపై ఆరా తీశారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించే విషయాన్ని అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ నిఖిత్ కౌసర్, జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.





ఎంపికైన క్రీడాకారులకు ట్రోఫీలను అందజేస్తున్న జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక

నిజామాబాద్ నాగారం: బాలబాలికల జిల్లా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో ప్రతిభ కనబర్చిన 30 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నరాల రత్నాకర్, రాజాగౌడ్ మంగళవారం తెలిపారు. ఈ నెల 23, 25 తేదీల్లో నిర్వహించిన అండర్ 14, 16, 18, 20 బాలబాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో జిల్లా నలుమూలల నుంచి 48 పాఠశాలలు పాల్గొన్నాయన్నారు. ఎంపికైన వారు అథ్లెట్లు ఈ నెల 30, 31వ తేదీలలో మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలు, కళాశాలలకు ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను అందజేశారు.

విభాగం	ప్రథమస్థానం	ద్వితీయస్థానం	తృతీయస్థానం
అండర్–14 బాలుర	ఎంజేపీ, మోర్తాడ్	ఎంజేపీ, నూత్‌పల్లి	మైనార్టీ గురుకుల, నాగారం
అండర్–14 బాలికలు	ఎంజేపీ, బాల్కొండ	నలంద హైస్కూల్	ఎంజేపీ, దాస్‌నగర్
అండర్ 16 బాలుర	ఎంజేపీ, రాంపూర్	బీబీసీ హైస్కూల్	ఎంజేపీ, ధర్మారం
అండర్ 16 బాలికల	ఎన్‌జీఎస్, నిజామాబాద్	మైనార్టీ గురుకుల	ఎంజేపీ, దాస్‌నగర్

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్మూర్ సి. ప్రభాకర్ ACO : 9010585333
నిజామాబాద్ అర్బన్ జి. రాంబాబు : 9849180084
నిజామాబాద్ రూరల్ ఎం. రాజేందర్ : 9866958559
బాల్కొండ ప్రదీప్ : 7893150102
బోధన్ ఎ.శివ : 9848056776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com